నింగిలో విరిసే హరివిల్లు నేలకు దిగింది. రంగురంగుల ముగ్గులతో తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానం కళకళలాడింది. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఏటా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు కేంద్రాల్లో వేడుకగా జరిగాయి. ఈ పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో తిరుపతి, చిత్తూరు, మదనపల్లి కేంద్రాల్లోనూ, ప్రస్తుత తిరుపతి జిల్లాలోని గూడూరులోనూ జరిగాయి. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి కళను ముందే మైదానంలో ఆవిష్కరించారు. పిల్లలు, పెద్దవాళ్లు, విద్యార్థినులు పోటీలు పడి ముగ్గులు వేశారు.


తిరుపతిలో జరిగిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ముగ్గు వేస్తున్న విద్య

ముందే వచ్చిన ముగ్గుల సంక్రాంతి

చిత్తూరు, తిరుపతి, మదనపల్లి, గూడూరుల్లో వేడుకలా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు


ప్రథమ బహుమతి
విద్యకు బహుమతి అందిస్తున్న అంజి, మౌర్య తదితరులు

ముగ్గుల పోటీల్లో విజేతలు
ఎం.విద్య, కొర్లగుంట, తిరుపతి: మొదటి బహుమతి
నీలమణి, భవానినగర్, తిరుపతి: రెండో బహుమతి
కె.ప్రమీల, ఎస్టీవీనగర్, తిరుపతి: మూడో బహుమతి

కన్సొలేషన్ విజేతలు
కె.పూజిత, ఎంఆర్‌పల్లె, తిరుపతి
ఎన్.పద్మ, బైరాగిపట్టెడ, తిరుపతి

ద్వితీయ బహుమతి




బహుమతి అందుకుంటున్న నీలమణి


బహుమతి అందుకుంటున్న ప్రమీల

తృతీయ బహుమతి



తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో నిర్వహించారు. లోకల్ స్పాన్సరర్‌గా చిల్లీస్ రెస్టారెంట్స్ అధినేత అంజి వ్యవహరించారు. ఈ పోటీల్లో 106 మంది మహిళలు, విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు అతిథులు మున్సిపల్ కమిషనరు మౌర్య, చిల్లీస్ అంజి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన ముగ్గుల పోటీల్లో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ముగ్గులోనూ సంక్రాంతి శోభ కనిపిస్తోందన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి.. విజేతలకు అభినందనలు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగ ప్రొఫెసర్ బీఎన్ నీలిమ, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగ అధ్యాపకురాలు డాక్టర్ కొణిదల శోభ వ్యవహరించారు.


ముగ్గుల ముందు సెల్ఫీలు



ఉమ్మడి జిల్లా విజేత

● మదనపల్లె మహిళ రెడ్డిరాణి

మదనపల్లె, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విజేతగా మదనపల్లెకు చెందిన ఉత్తరాది రెడ్డిరాణి ఎంపికయ్యారు. మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో 76 మంది పాల్గొన్నారు. ఈ పోటీలకు స్థానిక స్పాన్సరర్లుగా జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలు, ఆర్.కె.జ్యువెలర్స్, ఎస్.ఎ.నస్రీన్‌తాజ్ వ్యవహరించారు. మదనపల్లెకు చెందిన వి.రెడ్డిరాణి, ఎ.పద్మ, వి.రెడ్డిరాజేశ్వరి వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, స్పాన్సరర్లు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత డాక్టర్ రాటకొండ గురుప్రసాద్, ఆర్.కె.జువెలర్స్ అధినేత పచ్చిపాల తులసి, ఎస్.ఎ.నస్రీన్‌తాజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. చిత్తూరు, తిరుపతి, మదనపల్లెల్లో మొదటి బహుమతి సాధించిన ముగ్గురిలో మదనపల్లెకు చెందిన వి.రెడ్డిరాణిని జిల్లాస్థాయి విజేతగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు.


ముగ్గు వేస్తున్న రెడ్డిరాణి

చిత్తూరులో 130 మంది

చిత్తూరు(సెంట్రల్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగాయి. ఈ పోటీలకు 130 మంది హాజరై ఉత్సాహంగా ముగ్గులు వేశారు. ఈ పోటీలకు లోకల్ స్పాన్సర్‌గా జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్, జీజేఎం సుభీభవ ఏసీ మహల్ (చిత్తూరు) సహకారం అందించారు. మొదటి మూడు స్థానాల్లో బి.విజయలక్ష్మి (గుర్రప్పనాయుడు వీధి-చిత్తూరు), డి.బుజ్జీరావు (లక్ష్మీనగర్ కాలనీ-చిత్తూరు), జి.ప్రతిభ (మురకంబట్టు అగ్రహారం-చిత్తూరు) నిలిచారు. ముఖ్య అతిథులుగా హాజరైన చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.


ముగ్గు వేస్తున్న బి.విజయలక్ష్మి

గూడూరులో వేడుకగా పోటీలు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన ముగ్గుల పోటీల్లో 45 మంది పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు గార్డెనింగ్ పార్టనర్‌గా క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్‌గా డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) వ్యవహరించగా, నెల్లూరుకు చెందిన సీఎంఆర్, చందన బ్రదర్స్ స్థానిక పార్టనర్‌గా వ్యవహరించారు. ప్రథమ బహుమతి స్థానిక త్యాగరాజవీధికి చెందిన ఎం.విష్ణుప్రియ, ద్వితీయ బహుమతిని గూడూరు మండలం నెల్లటూరుకు చెందిన ఎన్.సుశ్మిత, తృతీయ బహుమతిని సైదాపురం మండలం లింగసముద్రం గ్రామానికి చెందిన ఎం.శేషమ్మ గెలుచుకున్నారు. డీఎస్పీ వీవీ రమణకుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. వీరితో పాటు మరో ముగ్గురు మహిళలకు కన్సోలేషన్ బహుమతుల కింద చీరలు, మరో 39 మందికి ప్రత్యేక బహుమతులను పాశం సంధ్యారాణి సహకారంతో అందించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు పాల్గొన్నారు.


గూడూరులో మొదటి బహుమతి పొందిన ముగ్గు వేస్తున్న ఎం.విష్ణుప్రియ

బోధన, పరిశోధనల్లో చరిత్రకు ప్రాధాన్యం పెరగాలి

● ప్రముఖ సాహిత్యవేత్త నాగసూరి వేణుగోపాల్
● గూడూరులో ముగిసిన రెండు రోజుల ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు)/గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో చరిత్రకు మరింత ప్రాధాన్యం పెరగాలని ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. గూడూరులోని ఎస్‌కెఆర్ డిగ్రీ కాలేజీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 47వ వార్షిక సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభలో నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ.. మారిన సామాజిక పరిస్థితుల్లో చరిత్ర కీలకంగా మారిందన్నారు. చరిత్రను మరింత విస్తృతమైన, విభిన్నమైన కోణాల్లో పరిశీలించాలని కోరారు. మరుగున పడిన చరిత్రను తవ్వి తీయాల్సిన బాధ్యత ఈ తరం పరిశోధకులపై ఉందన్నారు. చరిత్రను మనుషుల వ్యక్తిగతం, కుటుంబం, సామాజిక కోణాల్లో విశ్లేషించుకోవచ్చని సూచించారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్‌లో చరిత్రను అన్ని రకాలుగా వర్గీకరించుకొని ప్రత్యేక సమాంతర సదస్సులు నిర్వహించాలన్నారు. ఎంతో గొప్ప చారిత్రక ప్రదేశాలపై మరింత లోతైన అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. గాంధీ, పొట్టి శ్రీరాములు గురించి ఈ తరానికి తెలియని విషయాలను తాను పుస్తక రూపంలో అందించినట్టు చెప్పారు. పలు రాష్ట్రాలకు చెందిన 350 మంది ప్రతినిధులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. వీరికి నిర్వాహకులు సర్టిఫికెట్, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ, ఎస్వీయూ ఆర్కియాలజీ రిటైర్డు ప్రొఫెసర్ డి. కిరణ్‌క్రాంత్ చౌదరి, కాలేజీ ప్రిన్సిపాల్ శివప్రసాద్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ గోవిందు సురేంద్ర, చరిత్రకారుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


నాగసూరి వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

తీర్మానాలు
● చరిత్ర పరిశోధనల్లో కొత్త ధోరణులపై దృష్టి సారించాలి.
● ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను చరిత్ర పరిశోధనకు ఉపయోగించుకోవాలి.
● చైల్డ్ అబ్యూజింగ్, చైల్డ్ పోర్నోగ్రఫీ, అడల్ట్‌కంటెంట్ వంటి రుగ్మతలపై పరిశోధించాలి.
● డిగ్రీ స్థాయిలో చరిత్రను తప్పనిసరిగా బోధించాలి.
● సంస్కృతి, సంప్రదాయాలను కొత్త తరానికి అందించాలి.
● చరిత్ర రంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలి.
● చారిత్రక ప్రదేశాలపై పరిశోధనలు నిర్వహించి, ఆ ప్రదేశాలను అభివృద్ధి చేయాలి.
● చరిత్రను చదువుకున్న వారికి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి.



తిరుమలేశుడి సేవలో నటి మీనాక్షి చౌదరి

లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం వంటి చిత్రాల్లో నటించిన మీనాక్షి చౌదరి.. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు.
- తిరుమల, ఆంధ్రజ్యోతి

జగన్ విధానాలతోనే పార్టీ మునిగింది

● సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఆత్మీయ సమావేశంలో నేతల ధిక్కార స్వరం


మాట్లాడుతున్న నాగలాపురం జడ్పీటీసీ

సత్యవేడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తలను పట్టించుకోకుండా జగన్ వన్‌మ్యాన్ షోలాగా వ్యవహరించారు. ఆయన చేపట్టిన ఏకపక్ష విధానాలతోనే వైసీపీ మునిగింది' అని పార్టీ నేతలు కుండబద్దలు కొట్టారు. సత్యవేడులో ఆదివారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి సమక్షంలోనే నాయకులు జగన్‌పై నిరసన స్వరం వినిపించారు. ప్రధానంగా నాగలాపురం జడ్పీటీసీ సభ్యుడు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐప్యాక్ టీం, వలంటీర్ వ్యవస్థను నమ్ముకుని కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్లే ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కార్యకర్తల మనోభావాలు గౌరవించమని జగన్‌కు చెప్పండంటూ భూమనకు సూచించారు. నియోజకవర్గంలోని నాయకులు కడుపులో కత్తులు పెట్టుకుని పైకి ఐక్యతారాగం వినిపిస్తున్నారని కేవీబీపురానికి చెందిన ఓ నేత అన్నారు. మరికొందరు కూడా ఇవే అంశాలను ప్రస్తావించారు. కడుపులో ఉన్న కత్తులను నూరకుండా, పార్టీ బలోపేతం కోసం పనిచేద్దామని ఇన్‌చార్జి రాజేష్ అభ్యర్థించారు. తమ కడుపులో ఉన్న కత్తులను సానబెట్టి, ఆ కత్తులను టీడీపీపైకి విసరండని కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తాను జగన్‌తో మాట్లాడి కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. నాయకులు సుశీల్ కుమార్‌రెడ్డి, బీరేంద్రవర్మ, నిరంజన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సోమశేఖర్, దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, చిన్న, సురేష్, అపరంజిరాజు, చిన్నదురై, హరిశ్చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, క్రిష్టయ్య, మాధవి, సొరకాయలు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి ప్రస్తావనేదీ?

ఏ చిన్న కార్యక్రమం జరిగినా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పొగడ్తలతో ముంచెత్తే ఆపార్టీ నాయకులు.. ఈ సమావేశంలో ఆయన్ను ప్రస్తావించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇంచార్జ్ రాజేష్, ఎంపీ గురుమూర్తి మాత్రమే తమ ప్రసంగంలో పెద్దిరెడ్డిని ప్రస్తావించారు.

చంద్రగిరి

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. నెల్లూరుకు చెందిన దత్త కళానిలయం వారు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు సుస్మిత, దాక్షాయని, యోషిత, శ్రీలయ, వేద సహస్ర, రుష్మితశ్రీ, శ్రేష్ఠ, మోక్ష, స్ఫూర్తి, సాయి రిషిత తదితరులు గణపతి ప్రార్థన, అన్నమయ్య పదమంజీరం, కృష్ణ రాలీలామృతం, తరంగం, కృష్ణ తాండవ రాజరాజేశ్వరి అష్టకం, భో శంభో, మహిషాసుర మర్ధిని వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించారు.

అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ సురేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు డీసీహెచ్‌ఎస్ పరామర్శ



చంద్రగిరి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురై సీహెచ్‌ఎస్ చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆదివారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆనందరావు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని, సాయంత్రానికల్లా డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

9న టీడీపీ జెండా ఆవిష్కరణ

చంద్రగిరి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడలో ఈ నెల 9వ తేదీన తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించనున్నారు. గతంలో ఉన్న జెండా దిమ్మె రోడ్డు ప్రమాదంలో కూలిపోయింది. ఈ క్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కుమారరాజారెడ్డి, గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో దిమ్మె ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ చేయనున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, జగన్మోహన్‌నాయుడు, ఉమాపతిరెడ్డి, శంకర్‌యాదవ్, అయ్యప్ప, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి



విద్యార్థినులను పరామర్శిస్తున్న లోకేష్‌రెడ్డి

చంద్రగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థతకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఐరాల లోకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆదివారం విద్యార్థినులను పరామర్శించారు. పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు కలేంద్ర, యూత్ నాయకులు శివ, బాలాజీ, ఉషా, హేమంత్ రెడ్డి, అక్బరు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌చెర్రీస్ స్కూల్ వార్షికోత్సవం



జ్యోతి వెలిగిస్తున్న డైరెక్టర్ సునీల్‌కుమార్ రెడ్డి

తిరుపతి రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆర్‌సీ రోడ్డులోని రెడ్‌చెర్రీస్ స్కూల్ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం పీఎల్ఆర్ గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ వి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు. వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి అంతర కళాశాలల
క్రీడా, సాంస్కృతిక పోటీలు

తిరుపతిరూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహిస్తు న్నట్లు వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని నాలుగు వెటర్నరీ కాలేజీలు, ఒక డెయిరీ టెక్నాలజీ కళాశాలకు చెందిన 490 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. 8 రకాల క్రీడా పోటీలు, 15 అథ్లెటిక్స్, 27 సాంస్కృతిక విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ సీవీఎస్‌వో ఎస్.శ్రీధర్, ప్రత్యేక అతిథిగా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ హాజరవుతారని తెలిపారు.

మర్చిపోయిన పర్స్ అప్పగింత

తిరుమల, జనవరి5 (ఆంధ్రజ్యోతి): క్యూకాంప్లెక్స్ వద్ద భక్తులు పోగొట్టుకున్న పర్స్‌ను విజిలెన్స్ అధికారులు తిరిగి అందజేశారు. వైకుంఠం క్యూకాంపెక్స్2లోని స్కానింగ్ వద్ద ఓ భక్తురాలు పర్స్‌ను జారవిడుచుకుంది. గుర్తించిన విజిలెన్స్ అధికారులు సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా భక్తులను గుర్తించి తిరిగి అప్పగించారు. పర్స్‌లో రూ.1.43 లక్షల నగదు ఉన్నట్టు భక్తులు తెలిపాడు. తిరిగి అప్పగించిన వీఐ సురేష్, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ వెంకన్నను టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ అభినందించారు.

వైకుంఠద్వార దర్శన రోజుల్లో..
నిర్దేశిత సమయంలోనే అనుమతి

టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పది రోజుల వైకుంఠద్వార దర్శన రోజుల్లో టోకెన్లు, టికెట్లపై నిర్దేశించిన సమయం ప్రకారమే భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మరోసారి స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, ఆదివారం సాయంత్రం ఆయన ఆలయం వద్దనున్న నాదనీరాజనం వేదిక వద్దకు వెళ్లి భక్తులతో మమేకమయ్యారు. టీటీడీ కల్పిస్తున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. టీటీడీ చేసిన ఏర్పాట్లు బాగున్నాయని, ముఖ్యంగా లడ్డూ, అన్నప్రసాదాలు నాణ్యంగా, రుచిగా ఉన్నాయని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శ్రీవారి నిత్య తిరుచ్చి వాహన ఊరేగింపులో పాల్గొన్నారు.



పాతవేపకుప్పంలో రంకేసిన కోడెగిత్తలు

జోరుగా జల్లికట్టు





పరుగులు తీస్తున్న కోడె గిత్తలను నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

రామచంద్రాపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని పాతవేపకుప్పంలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. గ్రామస్తులు తమ కోడెగిత్తల కొమ్ములకు రంగులు వేసి, జల్లికట్టుకు వారం నుంచే సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం గ్రామ శివారుల్లో గ్రామదేవత వద్ద పూజలు నిర్వహించారు. గిత్తల కొమ్ములకు విలువైన బహుమతులతో పాటు రాజకీయ నాయకుల ఫొటోలను పెట్టి అల్లె వద్దకు తీసుకువచ్చారు. డప్పుకొట్టి వీధుల్లోకి పరుగులు తీయించారు. కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో కొందరికి స్వల్పగాయాలయ్యాయి. జల్లికట్టును తిలకించేందుకు వెదురుకుప్పం, వడమాలపేట, తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల నుంచి భారీగా జనం తరలివచ్చారు.

ఎల్లమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ సంక్రాంతి ఉత్సవాలను గతంలో ఎన్నడూ లేనివిధంగా అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే నాని సమీక్షించారు. ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి లోటూ రానివ్వకూడదన్నారు. అన్ని ప్రధాన వీధులలో విద్యుత్ దీపాల అలంకరణ చేయాలన్నారు. వలంటీర్లను ఏర్పాటు చేసి, క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. వాహన బేరర్లకు యూనిఫాం అందజేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఈవో మమత, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, ఈఈ వాసురెడ్డి, సీఐ సుబ్బరామిరెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గుండోడు కనుమ రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిమాకులకండ్రిగ అడవి నుంచి కొత్తనెన్నూరు వరకు అటవీ ప్రాంతంలో వచ్చే గుండోడు కనుమ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం భూమిపూజ చేశారు. కార్వేటినగరం రాజుల కాలం నుంచి నడకదారిగా ఉన్న ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు రూ.3.16కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రహదారి పూర్తయితే 30 గ్రామాల ప్రజలు తిరుపతికి వెళ్లడానికి 7కి.మీ దూరం తగ్గుతుందన్నారు. గత పాలకులు సంక్షేమంపై దృష్టి పెట్టకుండా అవినీతి అక్రమాలకు పాల్ప డ్డారని ఆరో పించారు. రోడ్డును మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులు నాయుడు, జిల్లా నేతలు చిన్నబాబు, జనార్దన చౌదరి, హరి ప్రసాద్, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరమ్మ పాల్గొన్నారు.

హత్య...హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

- కత్తి, ద్విచక్రవాహనం స్వాధీనం




హత్య హత్యాయత్నం కేసుల్లో నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) జనవరి 5(ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరు 31న ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారిని హత్య చేయడమేగాక మరో వ్యాపారిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి కత్తి, సేఫ్టీ పోల్డింగ్ ఐరన్ స్టిక్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. తిరుపతి కూరగాయల మార్కెట్‌లో కొర్లగుంటకు చెందిన షేక్ మాబూ సాహెబ్ టమోటాల వ్యాపారం చేస్తున్నాడు. కలికిరి చెందిన అజంతుల్లా అతని వద్ద పనిచేస్తున్నాడు. పొర్లవీధికి చెందిన మర్రికుంట రుద్ర రెండు నెలల క్రితం షేక్ మాబూ సాహెబ్ వద్ద రూ.వెయ్యికి కూరగాయలు కొన్నాడు. అప్పట్లో రూ.200 చెల్లించి, రూ.800 అప్పు పెట్టాడు. మాబూ సాహెబ్ తరచూ అడుగుతున్నా ఆయన సమాధానం చెప్పలేదు. గతనెల 31న ఉదయం 8 గంటల ప్రాంతంలో మార్కెట్‌లో కనిపించిన రుద్రను మాబూ సాహెబ్, అజంతుల్లా పిలిచి రూ.800 అడిగారు. 'పది మందిలో డబ్బు అడిగి పరువు తీస్తావా' అంటూ రుద్ర మాబూ సాహెబ్‌పై దాడికి దిగాడు. వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. 'ఇవ్వాల్సిన అప్పు అడిగితే మా ఓనర్‌పైనే దాడి చేస్తావా' అజంతుల్లా రుద్రను నిలదీశాడు. ఘర్షణ చోటు చేసుకుంది. ఆగ్రహించిన రుద్ర తన ఇద్దరు కుమారులు మర్రికుంట కల్యాణ్ కుమార్, మర్రికుంట యశ్వంత్‌కుమార్‌లను ఫోన్ చేసి పిలిచాడు. ముగ్గురు కలిసి కత్తితో మాబూ సాహెబ్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అడ్డువెళ్లిన అజంతుల్లాను కత్తితో పొడిచి హత్య చేశారు. సేఫ్టీ ఫోల్డింగ్ ఐరన్ స్టిక్‌తో మాబూ సాహెబ్‌పై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రుద్రను, అతని కుమారులను ఆదివారం పెద్దకాపులేఅవుట్‌లో అరెస్టు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, సేఫ్టీ పోల్డింగ్ స్టిక్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆకట్టుకుంటున్న విద్యాభ్యాస చిత్రాలు



శ్రవణం స్కూల్ ప్రహరీ గోడకు చిత్రాలు వేస్తున్న చిత్రకారులు



తిరుపతి(లీలామహల్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సరోజినిదేవి రోడ్డులోని శ్రవణం పాఠశాల ప్రహరీ గోడకు వేస్తున్న చిన్నపిల్లల విద్యాభ్యాస చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఓల్డ్ మెటర్నిటీ ఆస్పత్రి సమీపంలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న వినికిడి లోపం గల పిల్లల నిర్ధారణ, శిక్షణ సంస్థ ప్రహరీ గోడకు ఈ చిత్రాలు వేస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఈ బొమ్మలను చూస్తూ బాల్యాన్ని గుర్తు తెచ్చుకుంటున్నారు.

అంధులకు పండ్లు పంపిణీ



పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న ఉదయభానురెడ్డి, ధన్వంత్‌కుమార్

తిరుపతి(ఆటోనగర్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శివజ్యోతి నగర్‌లోని ప్రభుత్వ అంధుల హాస్టల్‌లో శ్రీజగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అంధులకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ అధికారులు పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. దివ్యాంగులకు సేవ చేయాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టిన సంస్థను వారు అభినందించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మోహన్‌రామిరెడ్డి, విశ్వనాథ్, చంద్రశేఖర్, గోవిందరెడ్డి సందీప్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పార్వతి, నిర్మలహీరా పాల్గొన్నారు.

రైతు నాయకుడు దల్లేవాల్ ప్రాణాలు కాపాడండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమానుష వైఖరిని విడనాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని, 40 రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీర్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని కోరుతూ దల్లేవాల్ నవంబర్ 26 నుంచి దీక్ష చేపడుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు.

గాంధీపురం డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఆదివారం ఆ పంచాయతీ పరిధిలోని నాలుగు వార్డులలో ఆయన పర్యటించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. దెబ్బతిన్న తెలుగుగంగ పైపులను మరమ్మతు చేయాలని కోరారు. పార్టీ నాయకులు శ్రీరాములు, రవి, ఆర్ఎం.సుజాత, సుమతి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్,సినీ నిర్మాత నాగవంశీ, ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఐపీఎస్ అధికారి విద్యాసాగర్ నాయుడు ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



అనగాని సత్యప్రసాద్, నాగవంశీ





విద్యాసాగర్ నాయుడు - ప్రవీణ్‌కుమార్

ఎడ్వాన్ జర్నల్ ఎడిటోరియల్ సభ్యుడిగా దేవప్రసాదరాజు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సైన్స్ రంగంలో ప్రముఖ జర్నల్ ఎడ్వాన్ ఎడిటోరియల్ సభ్యుడిగా ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బి.దేవప్రసాద రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఎడ్వాన్ జర్నల్ ఇండియన్ ప్రతినిధి గ్రెగ్ ఓబిరియన్ తెలిపారు. సైన్స్ రంగంలో మరింత ప్రామాణిక పరిశోధనలు సాగడానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా దేవప్రసాదరాజు పేర్కొన్నారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలోనే పీజీ, పీహెచ్‌డీ, అధ్యాపకత్వం వహించిన దేవప్రసాదరాజు బోధన, పరిశోధన, విస్తరణ, పాలనా రంగాల్లో విశేష కృషి చేశారు. ఎలక్ట్రాన పార్యరా మ్యాగ్నటిక్ ప్రత్యేక అంశంగా గొప్ప పరిశోధన చేశారు. ఆయన రాసిన 110 పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. అడ్మిషన్స్ విభాగ జాయింట్ డైరెక్టర్‌గా, శాస్త్ర ఉపకరణ కేంద్రం డైరెక్టర్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, ఏపీ రీసెట్ కన్వీనర్‌గా, ఫిజిక్స్ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన్ను పలువురు అభినందించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.26 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,990
తలనీలాలు సమర్పించినవారు: 21,205

మంత్రి లోకేష్‌ను కలిసిన అనిత యాదవ్



తిరుపతి(జీవకోన), జనవరి5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను నగర పాలక సంస్థ 48వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి విరివిగా కార్యక్రమాలు చేపట్టాలని లోకేష్ సూచించినట్లు ఆమె తెలిపారు. కొర్లకుంట ముని ఆమె వెంట ఉన్నారు.

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు..
అనుమతించడం అభినందనీయం



సత్యవతి రాథోడ్

తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం కొన్ని రోజులుగా తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకోకపోవడం ఇబ్బందిగా ఉండేదని, ఈనెల 20వ తేదీ నుంచి వాటికి అనుమతి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్న ఏపీ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నామని తెలంగాణ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. శ్రీవారిని ఏ రాష్ట్రానికో, ఏ ప్రాంతానికో పరిమితం చేయలేమన్నారు. రైతులకు, ప్రజలకు ఇచ్చిన మాటలను నిలుపుకునేలా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

గోవిందరాజస్వామి వాకర్స్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులు

తిరుపతి(కపిలతీర్థం), జనవరి5(ఆంధ్రజ్యోతి) : గోవిందరాజస్వామి వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. టీటీడీ రిటైర్డ్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ శంకర్‌ల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పీసీ రాయల్, అధ్యక్షుడిగా కె.రఘురామరెడ్డి, కార్యదర్శిగా తోట చక్రపాణి, కోశాధికారిగా జి.పోతప్ప, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, భారతి, జాయింట్ సెక్రటరీలుగా ఎ.గోపియాదవ్, పి.హరిబాబు, ఈసీ మెంబర్లుగా శివారెడ్డి, చంద్రశేఖర్, రమణ, దొరస్వామి నాయుడు, సుబ్బరావు, మురళీమోహన్‌లను ఎన్నుకున్నారు.

ముగ్గు మురిసే..!

● సందడిగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు






ఆకట్టుకున్న ముగ్గులు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సప్తగిరులపై కమ్ముకున్న హిమ సోయగాలు మెల్లగా జారుకుంటున్నాయి. వెంకన్న పాద పీఠం అలిపిరికి అల్లంత దూరంలో ఉండే నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానం అందమైన హరివిల్లులను ఆవిష్కృతం చేసింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ పిలుపుమేరకు ఉదయం 9 గంటల నుంచి మహిళలు స్కూల్ గ్రౌండ్‌కు ఒక్కొక్కరుగా చేరుకున్నారు. వారికి కేటాయించిన స్థలాన్ని శుభ్రం చేసుకుని, కల్లాపి చల్లి ముగ్గుపిండిని చేతికి తీసుకుని సృజనాత్మకతో ముగ్గులను తీర్చిదిద్దారు. 106 మంది మహిళలు, విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మున్సిపల్ కమిషనర్ మౌర్య, లోకల్ స్పాన్సర్ చిల్లీస్ అంజి విజేతలకు బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగ ప్రొఫెసర్ బీఎన్ నీలిమ, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగ అధ్యాపకురాలు డాక్టర్ కొణిదల శోభలు వ్యవహరించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 106 మందికీ ఇషాని కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకురాలు పుష్ప వ్యక్తిగత బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి, తిరుపతి ఎడిషన్ ఇన్‌చార్జి సుధాకర్‌బాబు, బ్యూరో ఇన్‌చార్జి శివప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ నరేంద్ర తదితర సిబ్బంది పాల్గొన్నారు.



ముగ్గులు పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

● ముగ్గులాగా నగరాన్నీ అందంగా పెట్టుకుందాం

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని అందమైన ముగ్గులు వేయడం ఆనందంగా ఉంది. ప్రతి ముగ్గులో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. ముగ్గులు ఎంత అందంగా వేశారో, మన నగరాన్ని కూడా అంతే అందంగా పెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ముఖ్యంగా మహిళలు తలుచుకుంటే చెత్తలేని నగరంగా మార్చుకోవచ్చు. మన భారతీయతకు మూలమైన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తున్న ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు. విజేతలకు శుభాకాంక్షలు.

- మౌర్య, కమిషనర్, తిరుపతి నగరపాలక సంస్థ






కన్సొలేషన్ బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

● ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో నేనూ బాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. 15 ఏళ్లుగా నన్ను ఎంతగానో ప్రోత్సహించి ఆదరించడాన్ని మరిచిపోలేను. ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న వారందరికీ అభినందనలు. అదేవిధంగా చిల్లీస్ రెస్టారెంట్స్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నాం. మీ ఇంటి ముందు వేసిన ముగ్గును చిల్లీస్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మాకు పంపితే విజేతను ఎంపిక చేసి ఆకర్షణీయమైన బహుమతి అందజేస్తాం.

- చిల్లీస్ అంజి, చిల్లీస్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత

● మన సంస్కృతికి శాస్త్రీయమైన ప్రయోజనం ఉంది

ఒకప్పుడు బియ్యపు పిండితో ఇంటిముందు ముగ్గులు వేసేవారు. దీంతో పక్షులు వీటిని ఆహారంగా తీసుకునేవి. అదేవిధంగా ఇంటి ముందు ఆవుపేడతో అలకడం వలన క్రిమికీటకాలు దరిచేరేవి కావు. అంటే మన సంస్కృతి సంప్రదాయాల్లో శాస్త్రీయమైన ప్రయోజనం ఉంది. ప్రతి ఏడాదీ ఆంధ్రజ్యోతి క్రమం తప్పకుండా ముగ్గుల పోటీలు బాధ్యతగా నిర్వహిస్తూ ఉండటం గొప్ప విషయం.

- ప్రొఫెసర్ బీఎన్ నీలిమ, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ

● సంక్రాంతి మన సంస్కృతికి గుర్తు

సంక్రాంతి పండుగ మన సంస్కృతికి గుర్తు. పంట చేతికొచ్చిన రైతులు ఈ పండుగ చేసుకుంటారు. ధాన్యాన్ని ఇంటికి తెచ్చిన సంబరంలో ఈ పండుగను నిర్వహించుకుంటారు. ముగ్గుల పోటీలు నిర్వహించి మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతున్న ఆంధ్రజ్యోతికి అభినందనలు.

- డాక్టర్ కొణిదల శోభ, తెలుగు అధ్యాపకురాలు, శ్రీపద్మావతి డిగ్రీ కళాశాల

● సందడి చేసిన ఎమరాల్డ్స్ విద్యార్థినులు

ఆంధ్రజ్యోతి సంక్రాంతి ముగ్గుల పోటీలు జరుగుతున్నాయని తెలుసుకున్న స్థానిక ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు పెద్దఎత్తున స్కూల్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అప్పటికే ప్రారంభమైన ముగ్గుల పోటీలను చూసి ముచ్చటపడ్డారు. వారిలో పలువురు ఉత్సాహంగా ముగ్గులు వేయడం మొదలుపెట్టారు. అతిథులు, నిర్వాహకులతో కలసి ఫొటోలు దిగారు. విజేతలను కేరింతలతో ప్రోత్సహించారు.

● ముగ్గులను పరిశీలించిన కమిషనర్

ముత్యాల ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మౌర్య ఎంతో ఓపిగ్గా ముగ్గులను పరిశీలించారు. వాటి నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి బహుమతులు పొందిన విజేతల ముగ్గులను పరిశీలించి వాటిని వేయడానికి ఎంత సమయం పట్టిందని అడిగారు. వారిలోని సృజనాత్మక కళను అభినందించారు.

దోబీఘాట్ సమస్యల పరిష్కారానికి కృషి



రజక కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న రజక వృత్తిదారులు

తిరుపతి అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మంగళం దోబీఘాట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రజక కార్పొరేషన్ డైరెక్టర్లు కరాటే చంద్ర, అన్నా సముద్రం మదన్‌మోహన్‌లు హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం వారు మంగళంలో ఉన్న దోబీఘాట్‌ను పరిశీలించారు. సమస్యలపై రజకులతో చర్చించారు. మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు కృషి చేస్తామన్నారు. శ్రీవీరభద్రస్వామి రజకవృత్తిదారుల సహకార సంఘ అధ్యక్షుడు నిమ్మనపల్లి మునిరత్నం, ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. జిల్లా రజక సంఘ కార్యదర్శి కొమ్మలమల సుధాకర్, కవిలి నాగరాజు, మార్కొండయ్య, శ్రీరాములు, లోకయ్య, ఉదయ్‌కుమార్, గోపాల్, చంద్ర, చెంగల్ రాయులు, సుధాకర్, బి.నాగరాజు, ప్రసాద్, కళావతి, రాజేశ్వరి, రెడ్డెమ్మ, జ్యోతి, కన్నయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీకి సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం



సత్యనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న యూనియన్ నేతలు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా తాండాయం సత్యనారాయణ విశేష సేవలందించారని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి కొనియాడారు. గతనెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన సత్యనారాయణను ఆదివారం బైరాగిపట్టిడలోని సీపీఐ కార్యాలయంలో సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ సత్యనారాయణ ఉద్యోగంతో పాటు నాయకత్వానికి న్యాయం చేశారని పేర్కొన్నారు. శేషజీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పులిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, శ్రీకాళహస్తి డిపో గౌరవాధ్యక్షుడు అంగూరు శ్రీనివాసరావు, ఆర్టీసీ అధికారులు నరసింహులు, రామచంద్ర నాయుడు, బాలాజీ, ఈయూ ప్రతినిధులు పి.సుబ్రహ్మణ్యంరాజు, ప్రభాకర్‌యాదవ్, ఈఆర్ కుమార్, మురుగమ్మ, గురునాథం పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



లక్ష్మీదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని సవితా యూనివర్సిటీ సీఎస్ఈ విభాగ పరిశోధకురాలు బి.లక్ష్మీదేవి డాక్టరేట్ పొందారు. టమోటో ప్లాంట్ డిసీజ్ ప్రెడిక్షన్ సిస్టం యూజింగ్ న్యూ ఫ్రేమ్‌వర్క్స్ ఎస్ఎస్‌మెన్ అండ్ ఎస్ఎస్‌మెన్ విత్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అంశంపై డాక్టర్ ఎంఎస్ శరవణం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ సీఎస్ఈ విభాగంలో ఆమె కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

సైనిక్, నవోదయ ప్రవేశపరీక్షల

శిక్షణకు కేరాఫ్ విశ్వం

● 13న సైనిక్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు చివరి గడువు

● కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి



విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ ప్రవేశపరీక్షలకు తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం కేరాఫ్‌గా నిలుస్తోందని సంస్థ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. వరదరాజనగర్‌లోని స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై జాతీయ స్థాయి పోటీ పరీక్షలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారని వెల్లడించారు. 34 సంవత్సరాలుగా తమవద్ద శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. గతేడాది 6, 9తరగతులు సైనిక్ ప్రవేశపరీక్షల్లో ఏపీలో మొదటి ర్యాంకుతోపాటు మొత్తంగా 61మంది విద్యార్థులు సీట్లు సాధించి సంచలన ఫలితాలు నమోదు చేశారని తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్స్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు ఈనెల 13న గడువు ముగుస్తుందని, ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 8688888802 / 9399976999 లను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

● టీడీపీ నేతల సమాచారంతో అడ్డుకున్న అధికారులు



ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మంగళం మిట్టగాంధీపురానికి వెళ్లే దారిలో కొందరు ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నించారు. అదే ప్రాంతానికి చెందిన టీడీపీ నేతలు ఇచ్చిన సమాచారంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మంగళం-శెట్టిపల్లి రహదారి మధ్యలో నుంచి మిట్టగాంధీపురం వెళ్లే మలుపులో మంగళం లెక్క దాఖలు సర్వే నెంబరు 76లో అర ఎకర ప్రభుత్వ భూమి ఉంది. ఆదివారం ఉదయం తిరుపతికి చెందిన నలుగురు వ్యక్తులు కూలీలతో చేరుకుని కట్టడాలు ప్రారంభించారు. టీడీపీ నాయకులు సురేష్‌నాయుడు, చలపతి, అల్లాబాషా అక్కడికి చేరుకుని ఇది ప్రభుత్వ స్థలమని, నిర్మాణం ఆపాలని కోరారు. ఆక్రమణదారులు తమ వద్దవున్న ఆధారాలను చూపిస్తూ ఎదురుతిరిగారు. దీంతో టీడీపీ నేతలు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీఆర్వోలు సతీష్, ప్రసాద్‌లు అక్కడికి చేరుకుని నిర్మాణాలను అడ్డుకున్నారు. అప్పటికే నిర్మించిన వాటిని కూల్చేశారు. ఆక్రమణదారుల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించగా అవి నకిలీవని నిర్ధారించారు. సురేష్‌నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రచయితలకు పురస్కారాల ప్రదానం



పురస్కారాలు స్వీకరించిన ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘర్షణ సమితి బహుజన సామాజిక రచయితలకు పురస్కారాలను ప్రదానం చేసింది. ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో ఈ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సాహితీవేత్తలు మౌని, సాకం నాగరాజు, ఎండపల్లె భారతి, ఎంఆర్ అరుణకుమారి, పలమనేరు బాలాజీ, పేరూరి బాలసుబ్రమణ్యం, వీఆర్ రాసానిని తుడా వైస్ చైర్మన్ వెంకటనారాయణ, ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు రూ.5 వేల నగదు, శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు అక్కినపల్లె లక్ష్మయ్య, సాకం ప్రభాకర్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరయాదవ్, కార్పొరేట్ అన్నా అనిత, గుండ్లూరు వెంకటరమణ, బుసగాని లక్ష్మయ్య, అశోక్ సామ్రాట్, బీవీ కేశవులు, అరసం కార్యదర్శి యువశ్రీ మురళి పాల్గొన్నారు.

తిరుపతిలో బ్లేడు బ్యాచ్ హల్‌చల్

- కర్ణాటక వ్యాపారిపై హత్యాయత్నం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం బ్లేడు బ్యాచ్ హల్‌చల్ చేసింది. గోవిందరాజస్వామి ఆలయం వద్ద దారాలు, దండలు, పూసలు విక్రయించే కర్ణాటక రాష్ట్రానికి చెందిన వెంకటేష్ బాబుపై పలువురు వ్యక్తులు దాడి చేసి పారిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు తీవ్ర గాయాలైన వెంకటేష్ బాబును తిరుపతి రుయాకు తరలించారు. ఈస్ట్ ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ కాలూరు గ్రామంలో పాత కక్షలతో రెండు వర్గాల మహిళలు ఘర్షణపడ్డారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... సీమల్లవరం పంచాయతీ కాలూరు గ్రామంలో అక్కచెల్లెళ్లు రమాదేవి, రాధ కాపురముంటున్నారు. రాధ తరచూ తమ ఇంటిపక్కనున్న కాలువలో చెత్త పోస్తుండడంతో చాముండేశ్వరి ప్రశ్నించింది. వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహానికి గురైన చాముండేశ్వరి రాధను కొట్టింది. చెల్లిపై దాడి చేస్తుండడంతో రమాదేవి వచ్చి చాముండేశ్వరిని అడ్డుకుంది. ఇరువర్గాలమహిళల ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ షావలి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంగాధరానికి అభ్యుదయ రైతు పురస్కారం



అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ గంగాధరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయవేత్త డాక్టర్ కోటపాటి గంగాధరం అభ్యుదయ రైతు పురస్కారాన్ని పొందారు. రైతు నేస్తం శిక్షణా కేంద్రం, విజ్ఞాన్ యూనివర్సిటీ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని ప్రకటించాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. సేంద్రియ సేద్యాన్ని ప్రోత్సహించడంలో డాక్టర్ గంగాధరం చేస్తున్న కృషిని మంత్రి కొనియాడారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి విద్యుత్ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. పాడిపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గంగనగుంట, మిట్టమీద కండ్రిగ, వేమూరు, పానకం, పానకం దళితవాడలో సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలోని అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పులిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 3వేల పదోన్నతులను వెంటనే కల్పించేలా కృషి చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుతూ ఈహెచ్ఎస్ ద్వారా ఉద్యోగులకు కనీస వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఈయూ జిల్లా నూతన కార్యవర్గం



కొలువుదీరిన నూతన కార్యవర్గం

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక బైరాగిపట్టిడ సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.ఆర్.చంద్ర, కార్యదర్శిగా వి.మస్తాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శిగా కె.రఘు, కోశాధికారిగా ఎస్.ఎస్.మణ్యం, ప్రచార కార్యదర్శి జె.సతీష్‌నాయుడితో పాటు ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, అసిస్టెంట్ సెక్రటరీలతో కలిపి మొత్తం 27 మందితో నూతన కార్యవర్గం ఎన్నికైంది.

ఆప్కోలో ఆన్‌లైన్ సేల్స్ ప్రారంభం

తిరుపతి అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆప్కోలో ఆన్‌లైన్ సేల్స్ ప్రారంభించినట్లు మండల వాణిజ్య అధికారి ఎన్.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, వెంకటగిరి, మాధవరం చీరలు, కాటన్, పట్టు చీరలు, డ్రస్ మెటీరియల్స్, రెడీమేడ్ షర్టులు, దుప్పట్లు, పంచెలు, లుంగీలు, టవల్స్ తదితర వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గాంధీరోడ్డు, శ్రీనివాసం కాంప్లెక్స్, తిరుమల సప్తగిరి సర్కిల్‌లోని ఆప్కో షోరూంలతో పాటు నెల్లూరు, చిత్తూరులోనూ అందుబాటులో ఉన్నాయని వివరించారు. అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం రాయితీ ఇస్తున్నామని, కావాల్సిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీసీవోహెచ్ఏఎన్‌డీఎల్ఓఓఎంఎస్.సీవోఎం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల మేరకు.. పేరూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన కుప్పల నందకుమార్ భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు తరచూ తల్లితో గొడవపడేవాడు. ఆదివారం తల్లిపై దాడికి దిగడంతో చెల్లెలు అడ్డుపడి మందలించింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న నందకుమార్ ఇంట్లోకి వెళ్లి లోపల గడియ పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. అయితే దీనిపై ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని సీఐ చిన్నగోవిందు చెప్పారు.

జిల్లా డిగ్రీ కాలేజీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా నరసింహులు



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా డిగ్రీ కాలేజీ అధ్యాపకుల సంఘం నూతన అధ్యక్షుడిగా టి. నరసింహులు ఎన్నికయ్యారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా టి.నరసింహులు, ఎస్.శ్రీకాంత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కోశాధికారిగా డాక్టర్ మన్యం నరసింహులు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె.నరసింహవర్మ, సహాయ కార్యదర్శిగా డాక్టర్ కె.కోటేశ్వరరావును నియమించారు. వీరిని సంఘ రాష్ట్ర సలహాదారు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, జూనియర్ కాలేజీ అధ్యాపక సంఘం అధ్యక్షుడు రవి అభినందించారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేసుకుందాం



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న డీఈవో కుమార్, డీవైఈవో బాలాజీ తదితరులు

తిరుపతి(విద్య), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా రంగాన్ని మరింతగా బలోపేతం చేసుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని డీఈవో కుమార్ పేర్కొన్నారు. పీఆర్‌టీయూ రూపొందించిన క్యాలెండరును డీవైఈవో బాలాజి, సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌తో కలసి ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి సదాశివన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తుకారాం, గురుప్రసాద్, మురళి, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

Mahabul Basha Ansar Basha (Old Name) S/o D.Makbhul Basha, D.No.11-119/1, Muslim Street, Nagalapuram, Tirupati Dt AP. have changed my Surname Mahabul Basha to Makbhul Basha for all my future purposes. My New Name is Makbhul Basha Ansar Basha.

AJT - 4897

CHANGE OF NAME

Mahabul Ansar Basha (Old Name), S/o D.Makbhul Basha, D.No.11-119/1, Muslim street, Nagala-puram, Tirupati Dt, AP. Have changed my surname Mahabul to Makbhul For all my future purposes. My new name is Makbhul Ansar Basha.

AJT - 4898

PLOTS FOR SALE

తిరుపతి నుండి 10 కి.మీ., 150 అడుగుల రోడ్డుకు ఆనుకొని 60 ఎకరాలలో తుడా అప్రూవల్ లే ఔట్‌లో ప్లాట్స్ కలవు. ప్లాట్ ధర కేవలం 15,45,000 మాత్రమే. సంప్ర. : 9966066111

AJT - 4886

PLOTS FOR SALE

రంగంపేట మోహన్ బాబు యూనివర్సిటీకి Opp. దాలర్స్ 15లో తక్షణ గృహ నిర్మాణానికి అనువైన తుడా అప్రూవల్ గల ఈస్ట్ ఫేస్ ప్లాట్ అమ్మబడును. 1 అంకణం రూ.85000. సెల్: 8688619936

AJT - 4885

WANTED

Job Opportunity at Gurappa Parameswara Electrical and Civil Works **Location**: Tirupati, Andhra Pradesh.We are hiring for the following positions: 1.Accounts Executive: Proficient in Tally, GST, and financial management. 2.Procurement Executive: Skilled in vendor management and procurement coordination. 3.System Administrator: Knowledge of typing, MS Office, and basic computer skills. **Eligibility**: Any degree, age 25-35 years, open to male and female candidates. How to Apply: Send resumes to **gpelectricalconstructions@gmail.com** or call **81234 59658**

AJT - 4879

WANTED

Position: Female Receptionist, Location: Fire and Feast Restaurant, Tirupati. Age:20-25 years hr@fireandfeast.in 8123459658

AJT - 4891

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః **7382114647**

AJA- 224877

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, బట్వ వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పక్షుల పండుగ ఏర్పాట్ల పరిశీలన


మొక్కకు నీరు పోస్తున్న పీసీసీఎఫ్ నాయక్, చిత్రంలో సీఎఫ్ సెల్వం, డీఎఫ్‌వోలు మెహబూబ్‌బాషా, హారిక

దొరవారిసత్రం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఏకే నాయక్ ఆదివారం తిరుపతి డివిజన్ సీఎఫ్ సెల్వంతో కలిసి ఆయన కేంద్రాన్ని పరిశీలించారు. ఈనెల 17, 18, 19 తేదీలలో పక్షుల పండుగను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలనకు ఆయన వచ్చారు. స్థానిక అధికారులతో చర్చించారు. చెక్‌లిస్ట్ ప్రాంతంలో మొక్కలను నాటారు. పక్షుల కేంద్రం విశిష్టతను పండుగ సమయంలో బాగా తెలియజేసేలా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఏటా పక్షుల సంఖ్య తగ్గుతుండటంతో కేంద్రంలోని చెరువుల కింద సాగు చేస్తున్న రైతులను ఆర్గానిక్ వైపు నడిపించేలా ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట డీఎఫ్‌వోలు హారిక, మెహబూబ్ బాషా, నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య పాల్గొన్నారు.

ఉత్తమ ఇంజనీర్లుగా రాణించాలి


గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేస్తున్న ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్దె, డాక్టర్ వంకి పెంచలయ్య తదితరులు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ విభాగాలలో ఉత్తమ ఇంజనీర్లుగా రాణించేందుకు పట్టుదలతో కృషిచేయాలని నాక్, ఎన్‌బీఏ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్ర బుద్దె అన్నారు. ఆదివారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిశంకర విద్యాసంస్థల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యతోపాటు వివిధ బహుళజాతి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలను కల్పించడం అభినందనీయమన్నారు. సమాజంలోని విప్లవాత్మక మార్పులను ఎప్పటికప్పుడు అనుసరిస్తూ వాటికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని తెలిపారు. వంకి అరవింద, వంకి అనూష, ప్రొఫెసర్ కృష్ణయ్య, వేణుమాధవ్, దుర్గాప్రసాద్, రాజయ్య, రామయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ


దివ్యాంగులకు నిత్యావసరాలను అందిస్తున్న రెడ్ సంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ దివ్యాంగులకు చేయూతనందించేలా ప్రతినెలా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విష్ణు వందన, అనిత, లక్ష్మీ, జానా సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి


సమావేశంలో అఖిలపక్ష నాయకులు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే కలపాలని అఖిలపక్ష నాయకులు డిమాండు చేశారు. ఆదివారం స్థానిక షాదిమంజిల్‌లో అఖిలపక్షం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయడంతో జిల్లా కేంద్రం తిరుపతికి వెళ్లాలంటే దూరం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ హామీ ఇచ్చారన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాలేషా, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్‌కుమార్, అబ్దుల్‌రహీం, భాస్కర్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, ప్రణీత్, సునీల్, ప్రభాకర్, చంద్రయ్య, శశికుమార్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారంతోనే ఉన్నత లక్ష్యాలు


బహుమతులు అందజేస్తున్న డీఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని డీఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. ఆదివారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యార్థినుల తల్లిదండ్రులతో అధ్యాపకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థినుల తల్లిదండ్రులకు క్రీడాపోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మునిగిరీష్, సురేష్, శ్రీనివాస్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదిక పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

సూళ్లూరుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల ఆలయంలో ఆదివారం 3వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక పోస్టర్లను బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా నాయకులు కారంశెట్టి మల్లికార్జున మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైక్య, తిరుపతి బ్రాహ్మణ సమాజం సంయుక్తంగా ఫిబ్రవరి 16న తిరుపతి వైఖానస కల్యాణ వేదికలో మూడో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉండే బ్రాహ్మణ కుటుంబ వధూవరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు డీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడులు

వాకాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురం సమీపంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. వారి నుంచి రూ.1150 నగదు, 3 కోళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మండలంలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అలరించిన ముత్యాల ముగ్గుల పోటీలు



● గూడూరులో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు


డీఎస్పీ వీవీ.రమణకుమార్ నుంచి మొదటి బహుమతిని అందుకుంటున్న ఎం.విష్ణుప్రియ


డీఎస్పీ వీవీ.రమణకుమార్ నుంచి రెండో బహుమతిని అందుకుంటున్న ఎస్.సుస్మిత


డీఎస్పీ వీవీ.రమణకుమార్ నుంచి మూడో బహుమతిని అందుకుంటున్న ఎం.శేషమ్మ

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు శ్రీచైతన్య పాఠశాల ఆవరణ ఆదివారం ముగ్గులతో హరివిల్లులా మారింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు గార్డెనింగ్ పార్టనర్‌గా క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్‌గా డిగొసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) వ్యవహరించగా, నెల్లూరుకు చెందిన సీఎంఆర్, చందన బ్రదర్స్ స్థానిక పార్టనర్‌గా వ్యవహరించారు. ఈ పోటీలలో 45 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి విజేతగా స్థానిక త్యాగరాజవీధికి చెందిన ఎం.విష్ణుప్రియ, ద్వితీయ బహుమతిని మండలంలోని నెల్లటూరుకు చెందిన ఎస్.సుశ్మిత, తృతీయ బహుమతిని సైదాపురం మండలం లింగసముద్రం గ్రామానికి చెందిన ఎం.శేషమ్మలు గెలుచుకున్నారు. న్యాయనిర్ణేతలుగా సునీత సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ, జీవని, పద్మావతి వ్యవహరించారు. అధికసంఖ్యలో మహిళలు ముగ్గులు వేయడంతో పాటు వేటికవే సరిసాటిగా నిలవడంతో విజేతల ఎంపిక కష్టసాధ్యమైందని న్యాయనిర్ణేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. విజేతలకు డీఎస్పీ వీవీ.రమణకుమార్ చేతుల మీదుగా బహుమతిగా చీరలను అందజేశారు. వీరితో పాటు మరో ముగ్గురు మహిళలకు కన్సోలేషన్ బహుమతులు కింద చీరలు, మిగిలిన 39 మందికి పాశిం సంధ్యారాణి సహకారంతో ప్రత్యేక బహుమతులు అందించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు, ఆంధ్రజ్యోతి పీసీఇన్‌చార్జి గిరీష్‌కుమార్, ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు సారంగం సులక్ష్మీ, జీవని, పద్మావతి

మహిళల్లో సృజనకు ప్రతిరూపం: డీఎస్పీ

ముగ్గులు మహిళలలోని కళకు ప్రతిరూపమని డీఎస్పీ వీవీ.రమణకుమార్ అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాల క్రీడా మైదానంలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముందుకొచ్చి గడిచిన 16 సంవత్సరాలుగా గూడూరులో ఏటా సంక్రాంతి పండుగలకు ముందు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళల్లో పనిఒత్తిడి తగ్గించేందుకు ఇలాంటి పోటీలు వారికి ఉత్సాహాన్ని, ఆనందాన్ని ఇస్తాయన్నారు. ఇలాంటి పోటీలతో మహిళలలో ఆలోచన శక్తిని, సృజనాత్మకతను పెంపొందించవచ్చునన్నారు. న్యాయనిర్ణేతలలో ఒకరైన సారంగం సులక్ష్మీ మాట్లాడుతూ పాతరోజుల్లో ఇంటిముంగిట బియ్యం పిండితో ముగ్గులు వేయడం అలవాటుగా ఉండేదన్నారు. ఆ పిండి చీమలకు, పక్షులకు ఆహారంగా ఉండేదన్నారు. అపార్టుమెంట్ల సంస్కృతి పెరగడంతో ముగ్గులకు ఆదరణ తగ్గిందన్నారు. మహిళలను రంగవల్లుల వైపు మళ్లించేందుకు ఆంధ్రజ్యోతి చేస్తున్న ఈ ప్రయత్నం మరువలేనిదన్నారు.


మొదటి బహుమతి పొందిన ముగ్గు


రెండో బహుమతి పొందిన ముగ్గు


మూడో బహుమతి పొందిన ముగ్గు

గురుకులంలో క్రీడా పోటీల ప్రారంభం


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం బీసీ గురుకులంలో జోన్-3 క్రీడా పోటీలను ఆదివారం ఎమ్మెల్యే విజయశ్రీ క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం సాయంత్రం బహుమతులు అందిస్తున్నట్లు దొరవారిసత్రం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తిరుపతయ్య తెలిపారు.ఛ జోన్-3లోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన ఎర్రగొండ, వినుకొండ, వేటపాలెం, వెంకటగిరి, దొరవారిసత్రం, నిజాంపట్నం, కోట, కొండపి, దాచేపల్లి గురుకుల పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

తెలుగు సంప్రదాయాలను కాపాడుకుందాం..!

గూడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సిరామిక్ కళాశాలలో సిరామిక్ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా పండుగలు నిలుస్తాయన్నారు. మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోడూరు మీరారెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ రోహిణి, వెంకటేశ్వర్లు, శివకుమార్, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా జయకుమార్‌రెడ్డి



తడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ట్రేడ్ యూనియన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా తడకు చెందిన బోడిలింగాలపాడు జయకుమార్‌రెడ్డిని వైసీపీ అధిష్ఠానం నియమించింది. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతోపాటు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం నెల్లూరులో కాకాణి, కిలివేటిలను శాలువతో సత్కరించారు.

ఫోటో : 5 వీకేడీ 4 : మహిళలకు బహుమతులు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి

ముందస్తు సంక్రాంతి సంబరాలు



వాకాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకాడు పరిధిలో ఉన్న ఎంజేఆర్ కాలనీలో ముందస్తు సంక్రాంతి సంబరాలను స్వర్ణసాగరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందస్తు సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి టీడీపీ మండలాధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, తూపిలి సాగునీటి సంఘం అధ్యక్షుడు తిరుమూరు శ్రీనివాసులురెడ్డి బహుమతులు అందజేశారు.

గురుకులంలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం


బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు

వాకాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో గత 25 సంవత్సరాలు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆదివారం ఒక్కటయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామంటూ పలు తీర్మానాలు చేపట్టారు. రానున్న రోజుల్లో అత్యాధునిక టెక్నాలజీతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పూర్వ విద్యార్థి టూరిజం ఐటీ చీఫ్ సెక్రటరీ సునీల్‌ను స్నేహితులు సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఆత్మకూరు వెంకటశేషయ్య, గౌరవ అధ్యక్షులు కొణతం సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి దండు ప్రసాద్, కోశాధికారి కిషోర్, ప్రధాన కోశాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, గుంటూరు, చిత్తూరు జిల్లాల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటమ్మకు ప్రత్యేక అభిషేకాలు

కోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి టీడీపీలో శాశ్వత సభ్యత్వం


ఎమ్మెల్యే విజయశ్రీ సమక్షంలో టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్న ప్రవీణ్

సూళ్లూరుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సమక్షంలో సూళ్లూరుపేటకు చెందిన వేనాటి ప్రవీణ్ రెడ్డి రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ స్వగృహంలో ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి సభ్యత్వాన్ని తీసుకున్న అతడిని అభినందించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఏజీ కిషోర్, పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పరసా రాజా, మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆవును ఢీకొని ఒకరికి గాయాలు

వెంకటగిరి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరిగుంట వద్ద ఆదివారం ఓ ఆవును ద్విచక్రవాహనం ఢీకొని స్థానిక రాజావీధిలోని లైఫ్‌స్టైల్ బట్టల దుకాణం యజమాని అఖిల్ గాయపడ్డాడు. 108 వాహనంలో వెంకటగిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంఖారావ సంఘీభావ ర్యాలీ


కోట క్రాస్ రోడ్డులో మానవహారం

కోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలో ఆదివారం విజయవాడలో జరిగే హైందవ శంఖారావం మహాసభకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన బ్రాహ్మణులు కోట పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో హైందవ శంఖారావం పూరించి విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కోట క్రాస్ రోడ్డులో మానవహారం నిర్వహించారు. ఈ తరానికి ధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో హైందవ పరిరక్షణ నాయకులు బీవీఎస్ నారాయణరావు, అనంతబాబు, సుబ్రహ్మణ్యంరెడ్డి, మురళీ, నరేష్, హరి, చంద్రారెడ్డి, హేమంత్‌శర్మ, సాయిబాబా, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో అనారోగ్యంతో ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి

నాయుడుపేట టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నెల్లూరు జిల్లా కలువాయికు చెందిన అజాముద్దీన్ (45) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు. అజాముద్దీన్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

కోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కోట క్రాస్ రోడ్డులోని తిన్నెలపూడికి వెళ్లే రోడ్డు వద్ద ఆదివారం రాత్రి ఓ కారు డివైడర్‌ను ఢీకొని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. గుంటూరుకు చెందిన నలుగురు పూర్వపు విద్యార్థులు వాకాడులోని గురుకులంలో జరిగిన విద్యార్థుల సమ్మేళనానికి హాజరై కారులో నలుగురు స్నేహితులు కోట క్రాస్‌రోడ్డు మీదుగా గుంటూరుకు వెళ్తున్నారు. తిన్నెలపూడి రోడ్డు వద్ద కారు వేగంగా డివైడర్‌ను ఢీ కొట్టడంతో కారు ముందు టైర్లు పగిలి ఒక్కసారిగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్వల్పగాయాలతో బయటపడ్డారు.

జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకటసుబ్బరాజు



ఓజిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం ఆరిమేనిపాడుకు చెందిన మాజీ ఎంపీటీసీ, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ మాజీ డైరెక్టరు కొండూరు వెంకటసుబ్బరాజు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఉత్తర్వులు ఇచ్చారని మండల వైసీపీ కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి ఆదివారం తెలిపారు. పార్టీ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

● మూడు దుంగల స్వాధీనం



స్మగ్లర్లు, స్వాధీనం చేసుకున్న దుంగలతో పోలీసులు

రేణిగుంట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామండూరు అటవీ ప్రాంతంలో గోకుడుబండల సమీపంలో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మూడు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బృందం శనివారం రేణిగుంట సమీపంలోని మామండూరు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. ఈ సమయంలో గోకుడు బండలు సమీపంలో చెట్లను నరుకుతున్న శబ్దాలు వినిపించడంతో అటువైపుగా వెళ్లారు. కొంతమంది ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగా మలుస్తూ కనిపించారు. వారిని చుట్టుముడుతుండగా పలువురు పారిపోయారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి మూడు దుంగలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పారిపోయిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ రఫి చెప్పారు.

సైనిక్, నవోదయ ప్రవేశపరీక్షల శిక్షణకు కేరాఫ్ విశ్వం

● 13న సైనిక్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు చివరి గడువు

● కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి



తిరుపతి(విద్య), జనవరి 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ ప్రవేశపరీక్షలకు తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం కేరాఫ్‌గా నిలుస్తోందని సంస్థ ఛైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. వరదరాజనగర్‌లోని స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై జాతీయ స్థాయి పోటీ పరీక్షలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారని వెల్లడించారు. 34 సంవత్సరాలుగా తమవద్ద శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. గతేడాది 6, 9తరగతుల సైనిక్ ప్రవేశపరీక్షల్లో ఏపీలో మొదటి ర్యాంకుతో పాటు మొత్తంగా 61మంది విద్యార్థులు సీట్లు సాధించి సంచలన ఫలితాలు నమోదు చేశారని తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్స్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు ఈనెల 13న గడువు ముగుస్తుందని, ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 8688888802/ 9399976999లను సంప్రదించాలని కోరారు.

హైందవ శంఖారావానికి
తరలిన శ్రీకాళహస్తి బీజేపీ నాయకులు



హైందవ శంఖారావం సభ వద్ద బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం గన్నవరంలోని కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ మైదానంలో జరిగిన హైందవ శంఖారావానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ నేతృత్వంలో భారీ ఎత్తున పట్టణం నుంచి నాయకులు తరలివెళ్లారు. దేవాలయాల పవిత్రత, హిందువుల ఐక్యత, సనాతన ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చినట్టు నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, కె.గోపాల్, వి.కృష్ణయ్య, రాఘవనాయుడు, సుకుమార్, మోహన్, భరత్‌కుమార్‌నాయుడు, నాగరాజు, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, శ్రీపురం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఎక్కడి సమస్యలు అక్కడే...!

● పరిష్కారానికి నిధులు లేవంటున్న అధికారులు

● పన్నుల వసూలు, భవన అనుమతులకు పరిమితమవుతున్న మున్సిపాలిటీ



సెంగుంధర్ వీధిలో రోడ్డుకు మరమ్మతులు

పుత్తూరు అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. వాటితో తమకు సంబంధం లేదన్నట్టుగా మున్సిపల్ అధికారులు మిన్నకుండిపోతున్నారు. మున్సిపల్ అధికారుల పనితీరును నిరసిస్తూ పట్టణంలోని సెంగుంధర్ వీధిలోని కల్వర్టుకు సొంత నిధులతో స్థానికులే మరమ్మతులు చేపట్టారు. నిత్యం వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఇద్దరు వ్యక్తులు స్పందించారు. మేస్త్రీ జయచంద్ర నిర్మాణ పనులు చేపట్టగా, అవసరమైన మెటీరియల్‌ను మునిరాజ అందజేశారు. జెండామాను వీధి, జెండామాను ఎక్స్‌టెన్షన్, తిమ్మాపురం, వేదవ్యాస స్కూలు ప్రాంతాల్లో రహదారులు, కాలువలు దెబ్బతిన్నాయి. ప్రతి సోమవారం ప్రజల నుంచి సమస్యలు స్వీకరించి సత్వరం పరిష్కరించాలన్న ఉద్దేశంతో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా పుత్తూరు మున్సిపాలిటీ అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పద్ధతికి స్వస్తిపలికారు. జనరల్ ఫండ్‌ను అత్యవసరాలకు వినియోగించమని ఎమ్మెల్యే భానుప్రకాష్ చెప్పినా అధికారులు ఖాతరు చేయడం లేదు. ప్రజలు మాత్రం సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పాలకుల పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పుత్తూరు, జనవరి5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్య విస్తరణాధికారులు, సామాజిక ఆరోగ్య అధికారుల సంఘానికి చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక ప్రభుత్వ వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రి వైద్యాధికారి కృష్ణకాంత్ ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివయ్య, జిల్లా అధ్యక్షుడు నరసింహప్రసాద్, కార్యదర్శులు వెంకటేశులు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

దీర్ఘకాల వ్యాధుల నయానికి ఫిజియోథెరపీ కీలకం



ప్రసంగిస్తున్న డాక్టర్ ఆర్ముగం - పట్టాలు అందుకున్న ఫిజియోథెరపిస్టులు

పుత్తూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాల వ్యాధులను నయం చేయడంలో డాక్టర్ల కంటే ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకమని విశ్రాంత స్విమ్స్ వైద్యాధికారి ఆర్ముగం అన్నారు. స్థానిక కేకేసీ ఫిజియో వైద్య కళాశాల తొలి పట్టభద్రుల దినోత్సవం ఆదివారం ఆ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పక్షవాతం, ప్రమాద బాధితులు, విభిన్న ప్రతిభావంతులు,ఎముకలు, నరాల బాధితులకు ఫిజియోథెరపిస్టుల సేవలు అత్యవసరమన్నారు. దేశంలో పదివేల మందికి ఓ ఫిజియోథెరపిస్టు లేడన్నారు. ఇతర దేశాల్లో మంచి డిమాండ్ వుందన్నారు. సానుభూతితో కాకుండా ఓపికతో వైద్యం చేయాలని విశ్రాంత డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. కళాశాల ఛైర్మన్, కుప్పయ్య శెట్టి, వైస్‌ఛైర్మన్ నరసింహారావు, ఎముకల వైద్య నిపుణుడు కిరణ్, సలహాదారుడు దామోదరం, ప్రిన్సిపాల్ మహేష్ పాల్గొన్నారు.

అర్హులకు గోకులం షెడ్లు

పిచ్చాటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆవులు, గేదెలు ఉన్న ప్రతి ఎస్సీ, ఎస్టీ పాడి రైతుకు ఉపాధిహామీ పథకం కింద గోకులం షెడ్లు మంజూరు చేస్తామని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా నిర్మిస్తున్న సిమెంటురోడ్లను వేగవంతం చేయాలని కోరారు.

గుంతలమయంగా మామండూరు రోడ్డు

కనిపించని సూచిక బోర్డులు ● ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు ● పట్టించుకోని అధికారులు



మామండూరు అటవీ ప్రాంతంలో మలుపు వద్ద గుంతలమయంగా రోడ్డు - ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద గతుకుల రోడ్డు

రేణిగుంట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామండూరు గ్రామ ప్రధాన రోడ్డు గుంతలమయమైంది. ఈ మార్గంలో ప్రమాదాల నివారణ నిమిత్తం ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు పిచ్చిమొక్కలతో నిండిపోయి కనిపించకుండా పోయాయి. రేణిగుంట నుంచి కడప వైపు వెళ్లే ప్రధాన మార్గమిది. రేణిగుంట కొత్త చెక్‌పోస్టు కూడలి నుంచి మామండూరు వరకు రోడ్డు దారుణంగా తయారైంది. నిత్యం ఈ మార్గంలో వాహన రాకపోకలు అధికం. వేగంగా వచ్చే వాహనాలు మలుపుల వద్ద గోతులు ఉండడంతో బ్రేకులు వేసినా అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ పరిస్థితి కొత్త చెక్‌పోస్టు కూడలి నుంచి అంజనేయపురం చెక్‌పోస్టు వరకు కన్పిస్తోంది. మరోపక్క మామండూరు అటవీ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు, వాహనాల వేగాన్ని తగ్గించేందుకు రోడ్డు పొడవునా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఆ బోర్డులు కనిపించడం లేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులతోపాటు సూచిక బోర్డులు వాహన దారులకు కనిపించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో కనిపించకుండా పోయిన సూచిక బోర్డులు

దుస్తుల వితరణ

పిచ్చాటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధిరాజుకండ్రిగ సమీపంలోని కొత్తచెరువు ఎస్టీకాలనీవాసులకు ఆదివారం రాజా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మనోహర్ దుస్తులను పంపిణీ చేశారు.

టీడీపీ మాజీ పట్టణాధ్యక్షుడికి బృందమ్మ పరామర్శ



పద్మావతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు అద్దండి డాంగే సతీమణి పద్మావతి ఇటీవల మరణించారు. ఆదివారం కర్మక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ హాజరయ్యారు. పద్మావతి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, నాయకులు బాలాజీరెడ్డి, దొరైరాజరెడ్డి, వజ్రం కిషోర్, సిద్ధులయ్య, అనిల్ తదితరులు కూడా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం

కేవీబీపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన నాలిబాబును టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు థామస్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు సాధు, సర్పంచు బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, వెంకటేష్, నాగరాజురెడ్డి తదితరులు పూలమాలలు వేసి దుశ్శాలువాతో సత్కరించారు. కూటమి తరపున తమతో కలిసి మండలాభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

సాధు రామలింగ అన్నదాన ట్రస్టు కార్యవర్గం ఎన్నిక

శ్రీకాళహస్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాధు రామలింగస్వామి అన్నదాన ట్రస్టు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇటీవల పాటూరి సుబ్రహ్మణ్యం నాయుడు మృతితో అధ్యక్ష పదవికి ఖాళీ ఏర్పడింది. దీంతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా ట్రస్టు వ్యవస్థాపకుడు పరబ్రహ్మానందగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా కార్యదర్శిగా పరమాత్మానందగిరి, సహాయ కార్యదర్శిగా పి.వ్యాసులు, కోశాధికారిగా పుణ్యం రామస్వామి ఆనంద్, సభ్యులుగా పాపానాయుడు, మస్తాన్ నాయుడు, నాగమణినాయుడు, వెంకటరత్నం నాయుడు, వేణుగోపాల్, విజయకుమార్, మోహన్‌ను ఎన్నుకున్నారు.

గుడిమల్లం ఆలయంలో అభివృద్ధి పనులు

ఆర్కియాలజీ అధికారుల పరిశీలన

ఏర్పేడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్, సౌత్ ఆర్డీ, సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ సూపరింటెండెంట్ డీఈ, ఏఈ, చంద్రగిరి ఆర్కియాలజీ శాఖ సర్కిల్ సీఐ తదితరులు ఆలయంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల పరిశీలన కోసం వచ్చారు. సౌత్ జోన్ ఆర్డీ ఎన్కే పతాక్, సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ గోపీనాథ్ ఆలయంలో అభివృద్ధి పనుల కోసం డీఈ, ఏఈకి తగిన ప్లాన్లను, అంచనాలను తయారు చేసి పంపాలని ఆదేశించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

మాజీ ఎంపీపీకి ఎమ్మెల్యే నివాళులు



ప్రేమావతమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం - ప్రేమావతమ్మ(ఫైల్ ఫొటో)

పిచ్చాటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మాజీ ఎంపీపీ కె. ప్రేమావతమ్మ భౌతికకాయానికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళులర్పించారు. శనివారం రాత్రి ప్రేమావతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ప్రేమావతమ్మ స్వగ్రామమైన పిచ్చాటూరు మండలం వేలూరు గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమావతమ్మ ఏపీ స్టేట్ సివిల్ సప్లయ్స్ డైరెక్టర్‌గా, శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలి సభ్యురాలిగా, పిచ్చాటూరు మండల ఎంపీపీగా పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. ఆమె మరణం పార్టీకి, మండలానికి తీరని లోటన్నారు. అనంతరం ప్రేమావతమ్మ భర్త శ్రీరాములునాయుడు, తనయుడు సతీష్‌నాయుడుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న వినుత

శ్రీకాళహస్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత అన్నారు. పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో 157వ నెల సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా ప్రత్యేక ప్రతిభావంతులకు, పేదలకు నిత్యావసర సరుకులు అందజేయడం గొప్ప విషయమన్నారు. మునీర్‌బాషా, జి.రమేష్‌బాబు, బాబా ఫరీద్, పుణ్యం ఢిల్లీకుమార్, సిబ్బంది, జనసేన నాయకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

రేణిగుంట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుచానూరు బైపాస్ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. తారకరామ నగర్‌కు చెందిన కృష్ణ(60), పళణి భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తిరుచానూరులో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో తూకివాకం పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ, పళణి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా కృష్ణ మృతి చెందాడు. ఆ మేరకు గాజులమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై కర్రతో దాడి

శ్రీకాళహస్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): యువకుడిపై కర్రతో దాడి చేసిన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని భాస్కరపేటలో శనివారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు.... భాస్కరపేటకు చెందిన చిన్న కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి సొంత అన్నతో కొంతకాలంగా విభేధాలున్నాయి. శనివారం ఫోన్‌లో అన్న నాగరాజుతో వాగ్వాదం జరిగింది. కాసేపటి తరువాత ఓ గుర్తు తెలియని యువకుడు చిన్నాపై కర్రతో హఠాత్తుగా దాడి చేసి గాయపరిచాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై 2వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు కాలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు

శ్రీకాళహస్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, రాష్ట్ర గనుల శాఖ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర సీఐడీ ఎస్పీ సరిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయం వద్ద రాష్ట్ర సీఐడీ ఎస్పీ సరిత

9న ప్రజా దర్బార్

శ్రీకాళహస్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరు జగనన్న కాలనీలో ఈనెల 9న ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలో ఇంటి పట్టాల పంపిణీ పేరుతో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 9వ తేదీ ప్రత్యేక ప్రజా దర్బార్ నిర్వహించి అందరి నుంచి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటినుంచి దివ్యాంగుల పింఛన్ల అర్హతపై పరిశీలన

రేణిగుంట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల అర్హతపై లబ్ధిదారులను సోమవారం నుంచి పరిశీలించనున్నట్టు ఎంపీడీవో విష్ణు చిరంజీవి తెలిపారు. మండలంలో ప్రస్తుతానికి 103మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. తొలి విడతలో ఈనెల 8వ తేదీ వరకు, రెండో విడత ఈ నెల 20, 21 తేదీల్లో పరిశీలన ఉంటుందని తెలిపారు. నెల్లూరు జిల్లా అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అనిల్‌బాబు, రాధిక, ప్రకాష్‌రెడ్డి ఈ పరిశీలనలో పాల్గొంటారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు కేటాయించిన తేదీల్లో విధుల్లో ఉండాలని ఆదేశించారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టండి



ఆలయ నిర్వాహకులకు సూచనలిస్తున్న డీఎస్పీ

ఏర్పేడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న సంతాన సంపద వేంకటేశ్వరస్వామి ఆలయం ఈనెల 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆలయ నిర్వాహకులకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం ఏర్పేడు సీఐ జయచంద్ర, సిబ్బందితో కలిసి ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రేణిగుంట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని గుండ్రాళ్లకాల్వ సమీపంలో జూదం ఆడుతున్నట్లుగా సమాచారమందుకున్న పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి పేకాట ఆడుతున్న వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంబడించి ఇద్దరిని పట్టుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.1300ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ అరుణ్ తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని ఎస్ఐ విశ్వనాథనాయుడు చెప్పారు. ఆదివారం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బీఎన్‌కే యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈనెల 18న ఫైనల్ జరుగుతుందని విజేతలకు నగదు బహుమతి అందిస్తామని నిర్వాహకులు తిరుమల, దొరై, అఖిల్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
Mahabul Basha Ansar Basha (Old Name) S/o D.Makbhul Basha, D.No.11-119/1, Muslim Street, Nagalapuram, Tirupati Dt AP. have changed my Surname Mahabul Basha to Makbhul Basha for all my future purposes. My New Name is Makbhul Basha Ansar Basha.
AJT - 4897

CHANGE OF NAME
Mahabul Ansar Basha (Old Name), S/o D.Makbhul Basha, D.No.11-119/1, Muslim street, Nagala-puram, Tirupati Dt, AP. Have changed my surname Mahabul to Makbhul For all my future purposes. My new name is Makbhul Ansar Basha.
AJT - 4898

PLOTS FOR SALE
తిరుపతి నుండి 10 కి.మీ., 150 అడుగుల రోడ్డుకు ఆనుకొని 60 ఎకరాలలో తుడా అప్రూవల్ లే ఔట్‌లో ప్లాట్స్ కలవు. ప్లాట్ ధర కేవలం 15,45,000 మాత్రమే. సంప్ర. : 9966066111
AJT - 4886

PLOTS FOR SALE
రంగంపేట మోహన్ బాబు యూనివర్సిటీకి Opp. డాలర్స్ 15లో తక్షణ గృహ నిర్మాణానికి అనువైన తుడా అప్రూవల్ గల ఈస్ట్ ఫేస్ ప్లాట్ అమ్మబడును. 1 అంకణం రూ.85000. సెల్: 8688619936
AJT - 4885

WANTED
Job Opportunity at Gurappa Parameswara Electrical and Civil Works Location: Tirupati, Andhra Pradesh.We are hiring for the following positions: 1.Accounts Executive: Proficient in Tally, GST, and financial management. 2.Procurement Executive: Skilled in vendor management and procurement coordination. 3.System Administrator: Knowledge of typing, MS Office, and basic computer skills. Eligibility: Any degree, age 25-35 years, open to male and female candidates. How to Apply: Send resumes to gpelectricalconstructions@gmail.com or call 81234 59658
AJT - 4879

WANTED
Position: Female Receptionist, Location: Fire and Feast Restaurant, Tirupati. Age:20-25 years hr@fireandfeast.in 8123459658
AJT - 4891

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 224877

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి